క్లుప్తంగా

లొకేషన్స్ ఆధారంగా సరుకుల పంపిణీ



బొల్లాపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, వలంటీర్లకు నిత్యావసర సరుకుల పంపిణీపై శనివారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎస్.దుర్గేశ్వరరావు మాట్లాడుతూ పౌర సరఫరాల శాఖ, జాయింట్ కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఎండీయూ వాహనాల ద్వారా కార్డుదారులకు సరుకుల సరఫరా సూచించిన విధంగా లొకేషన్స్‌ను గుర్తించి పంపించడం జరిగిందన్నారు. వలంటీర్ల యాప్ ద్వారా కార్డుదారులకు నిత్యావసర సరుకుల పంపిణీ ప్రదేశాలను గుర్తించి యాప్‌లో పొందుపరచి సంయుక్తంగా జనవరి 1 నుంచి పంపిణీ చేపట్టనున్నట్లు తెలిపారు. నిత్యావసర సరుకులను కార్డుదారులకు మరింత చేరువలో పంపిణీ చేసేందుకు ప్రభుత్వం రూపొందించిన ఈ విధానం వల్ల ఎంతో ఉపయోగకరమని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు, రేషన్ డీలర్లు ఎండీయూ ఆపరేటర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



నరసరావుపేట: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న రొంపిచర్ల గ్రామానికి చెందిన కళ్లి హనిమిరెడ్డికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.1.5 లక్షల చెక్కును శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి శనివారం తన కార్యాలయంలో అందజేశారు. డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు ఖరీదైన వైద్యం అందించేందుకు సీఎం సహాయ నిధి చేయూత ఇస్తోందన్నారు. కార్యక్రమంలో రొంపిచర్ల మండలం సీనియర్ నాయకులు మల్లికార్జున్ రెడ్డి పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



నరసరావుపేట టౌన్: ఖైదీలు తమకు ఉన్న హక్కులపై అవగాహన కలిగి ఉండాలని మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి టి.ప్రవల్లిక అన్నారు. శనివారం సబ్‌జైలును సందర్శించిన ఆమె ఖైదీలనుద్దేశించి మాట్లాడారు. ఉచిత న్యాయసహాయం పొందే విధానాన్ని వివరించారు. మానవ హక్కులు, లోక్ అదాలత్ గురించి తెలియజేశారు. అనంతరం ఖైదీలకు సంబంధించిన ఫిర్యాదు పెట్టెను తనిఖీ చేశారు. మొదట ఖైదీలకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో సబ్‌జైల్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ కె.వి. స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ల పాత్ర అభినందనీయం

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టారని, వలంటీర్లు స్వచ్ఛందంగా సేవ చేస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం అభినందనీయమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తెలిపారు. పట్టణంలోని కారంపూడి రోడ్డులో బొల్లా బ్రహ్మనాయుడు కన్వెన్షన్ హాల్‌లో వినుకొండ పట్టణంలోని అన్ని సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథుల ఆత్మీయ సమావేశం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు సమర్థవంతంగా పనిచేసేందుకు ప్రతి సచివాలయానికి ముగ్గురు గ్రామ సారథులను నియమించడం జరిగిందని, వార్డుల్లో, గ్రామాల్లో ఎక్కడైనా లోపాలు ఉంటే గుర్తించి వెంటనే సమస్యను పరిష్కరించేందుకు గృహ సారథులు పని చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వైఎస్సార్ సీపీలోకి భారీ చేరికలు

పట్టణంలోని కారంపూడి రోడ్డులో గల బ్రహ్మనాయుడు కల్యాణ మండపంలలో వినుకొండ నియోజకవర్గం నూజెండ్ల మండలం తలార్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని దాట్లవారిపాలెం గ్రామంలోని టీడీపీకి చెందిన 20 కుటుంబాలు స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారికి అండగా ఉంటానని, పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు.

వలంటీర్ల సేవలు విలువైనవి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు

చిలకలూరిపేట: దేశచరిత్రలో మునుపెన్నడూ లేని సంక్షేమ విప్లవం సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో సాధ్యమైందని.. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి నేడు సంక్షేమ పథకాలు చేరుతున్నాయంటే అందులో వలంటీర్ల పాత్ర ఎంతో విలువైనదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు చెప్పారు. పట్టణంలోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మన రాజేష్‌తో మన వలంటీర్లు అనే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో ప్రత్యక్షంగా ప్రజల ఇబ్బందులు తెలుసుకున్నారని చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా సంక్షేమమే పరమావధిగా అడుగులు వేశారని తెలిపారు.

మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్ల నియోజకవర్గ అధ్యక్షుడు విడదల గోపీనాథ్, వైస్ చైర్మన్లు వలేటి వెంకటేశ్వరరావు, కొలిశెట్టి శ్రీనివాసరావు, కొమరవల్లిపాడు సొసైటీ అధ్యక్షుడు కొండవీటి ఆంజనేయులు, రాష్ట్ర ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు క్లస్టర్-1 పఠాన్ తలహాఖాన్, క్లస్టర్-2 విడదల కమలేంద్ర, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కొప్పురావూరి పటేల్, నాయకులు పాట్టి శ్రీరాములు, బేరింగ్ మౌలాలి, తాళ్ల అంజిరెడ్డి, అన్నపురెడ్డి శ్రీలక్ష్మి, చెమిటిగంటి పార్వతిదేవి, ఆలపాటి పద్మావతి, యాదల సుజాత, సాపా సైదావలి, పంగులూరి వెంగళరాయుడు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు పోలిశెట్టి మస్తాన్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్లెల రాజేష్‌నాయుడు

బయటపడ్డ నకిలీ విత్తనాల బాగోతం

రొంపిచర్ల: నకిలీ వరి విత్తనాలను సాగు చేసి రైతు నష్టపోయిన సంఘటన మండల కేంద్రమైన రొంపిచర్లలో వెలుగులోకి వచ్చింది. వివరాల్లో కెళ్లితే.. రొంపిచర్లకు చెందిన గెల్లి చినకోటిరెడ్డి 100 కేజీల విత్తనాలను నరసరావుపేటలోని ఓ విత్తనాల షాపులో కొనుగోలు చేసి నారు పోసి నాట్లు వేశాడు. నాటిన 35 రోజుల నుండే వరి మొక్కల నుండి చిన్న చిన్న కంకులు వచ్చి ఎండి పోతుంది. అప్పటికే వేలాది రూపాయలు సాగుకు ఖర్చు అయ్యింది. విషయాన్ని విత్తనాల వ్యాపారికి తెలియజేసినప్పటికీ ఎలాంటి స్పందన రాకపోవటంతో చేసేదిలేక వ్యవసాయ అధికారులను కోటిరెడ్డి సంప్రదించాడు. జిల్లా వ్యవసాయ అధికారి జేడీఏకు ఫిర్యాదు చేశాడు. మండల వ్యవసాయ అధికారి విద్యాసాగర్ వరి పొలాన్ని పరిశీలించారు. రైతు నుంచి విత్తనాల కొనుగోలు, నారు, నాటు వేసిన పద్ధతి, ఎరువుల వాడకం, పురుగుమందుల పిచికారీ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు చేసిన బిల్లును కూడా పరిశీలించారు.

పల్నాటి చరిత్ర కావ్యం కమనీయం

కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట ఈస్ట్: పల్నాటి చరిత్రను కవిసార్వభౌముడు శ్రీనాథ మహాకవి అద్భుతమైన కావ్యంగా మలిచారని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. నెల నెల సాహిత్యమేళ కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం ప్రకాష్‌నగర్‌లోని టౌన్‌హాల్‌లో శ్రీనాథ మహాకవి సాహిత్యంపై సాహిత్య సమాలోచన నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ, నాటి తరం కవులలో శ్రీనాథుడు కవి సార్వభౌమునిగా ఖ్యాతి గడించారని తెలిపారు. పల్నాటి వీర చరిత్రను శ్రీనాథుడు కవితా రూపంలో పలికించిన తీరు అద్వితీయమని కొనియాడారు. శ్రీనాథుని కవితలను వినిపించి తెలుగు భాషపై తనకున్న అభిమానాన్ని, పట్టును చాటారు. సాహిత్య కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనాథ మహాకవి వంశీకుడు కావూరి శ్రీనివాసశర్మ కవితలు, పద్యాలతో ఆకట్టుకున్నారు. కలెక్టర్ శివశంకర్ చేతుల మీదుగా శ్రీనివాసశర్మను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన పల్నాటి చరిత్ర, పల్నాటి మహనీయులు రూపకం ఆకట్టుకుంది. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సాయి మార్కొండారెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్, జిల్లా డిడిఓ మహాలక్ష్మీ, శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి, పల్నాడు కళావేదిక అధ్యక్షుడు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, రిటైర్డ్ ఆంధ్రోపన్యాసకుడు డాక్టర్ చేరెడ్డి మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రూపకాన్ని ప్రదర్శించిన చిన్నారులతో కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యాంప్రసాద్

గ్రంథాలయంలో పోటీపరీక్షల పుస్తకాలు



రొంపిచర్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో కాంపిటేటివ్ ఎగ్జామ్స్ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని గ్రంథాలయాధికారి జి.సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ రంగ ఉద్యోగాలు, గ్రూపు-1, 2 ఉద్యోగాలు, పోటీ పరీక్షల కోసం రాసే అభ్యర్థులకు ఈ పుస్తకాలు నిత్యం అందుబాటులో ఉంటాయన్నారు.

పేదరిక నిర్మూలన విద్యతోనే సాధ్యం

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

శావల్యాపురం: పేదరిక నిర్మూలన విద్యతోనే సాధ్యమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నా రు. శనివారం మండలంలోని వేల్పూరు గ్రామం జెడ్పీ ఉన్నత పాఠశాల్లో విద్యా సేవలో 25 వసంతాలు పూర్తి చేసుకున్న పారా గోపయ్య స్మారక ప్రతిభా పురస్కార రజతోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం 2023-24 విద్యా సంవత్స రంలో పదోవ, ఏడవ తరగతి మంచి ఫలితాలు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులకు రూ.1000 నగదు మెమెంటు, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యులు షేక్ మహబుబ్ సుభాని, పాఠశాల పేరెంట్ కమిటీ చైర్మన్ పల్లపాటి శ్రీనివాసరావు, సర్పంచ్ బీర్నేడి రత్నప్రభ, విశ్రాంత డీఎస్పీ బీరం నాగేశ్వరరావు, పారా సరోజిని వివేకనంద పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షులు సంద్రపాటి చలపతిరావు, విశ్రాంత లెక్చరర్ కవి సమ్మేళకులు బీరం సుందరరావు, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్, సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ముప్పాళ్ల దిష్టిబొమ్మ దహనం



ముప్పాళ్ల దిష్టి బొమ్మను దహనం చేస్తున్న నాయకులు

వినుకొండ (నూజెండ్ల): వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకులు, మహిళా నాయకులు ఆధ్వర్యంలో పట్టణంలోని పల్నాడు రోడ్డులో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల దిష్టిబొమ్మను చెప్పులతో కొట్టి ముప్పాళ్ల డౌన్‌డౌన్, జోహార్ ముప్పాళ్ల, చందాల నాగేశ్వరరావు అంటూ నినాదాలు చేసి దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడుపై చేసిన వ్యాఖ్యలను ముప్పాళ్ల వెనక్కు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలను ఎమ్మెల్యే దుర్భాషలాడినట్లు సోషల్ మీడియా ఆధారంగా వాస్తవాలు తెలియకుండా ఎమ్మెల్యే దిష్టిబొమ్మలను దగ్ధం చేయడం సిగ్గుచేటన్నారు. వినుకొండలో మసీదుమాన్యం భూములను అమ్ముకొని ముస్లింల ఆస్తులకు రక్షణ లేకుండా చేశారని, చందాలు వసూలు చేసుకొనే నాగేశ్వరరావుకి వినుకొండను అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును విమర్శించేస్థాయి లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, యువజన విభాగం నాయకులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజా అవసరాలకు తగ్గట్లుగా పాలన

కొత్తపల్లిలో సచివాలయం, హెల్త్‌కేర్ ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

రొంపిచర్ల: ప్రజా అవసరాలకు తగ్గట్లుగా పరిపాలన అందుబాటులోకి తీసుకొచ్చిన ప్రభుత్వం వైఎస్సార్‌సీపీదేనని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శనివారం రాత్రి రూ.65 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయం, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లను ప్రారంభించారు. ఈసందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడుతూ పాలనను అందుబాటులోకి తీసుకొచ్చేందుకే గ్రామ సచివాలయ వ్యవస్థ ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గడ్డం వెంకటరావు, సర్పంచు నందిగం మంగమ్మ, ఉపసర్పంచు ఇగుటూరి రంగారెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ బత్తుల రామకృష్ణ, గుజ్జుల ప్రభాకరరెడ్డి, జక్కిరెడ్డి కాశిరెడ్డి, ముచ్చుమారి వెంకటేశ్వరరెడ్డి, పచ్చవ రవీంద్రబాబు, కోడూరి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



గ్రామంలో సచివాలయం, హెల్త్‌కేర్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

2 నుంచి రెండవ దఫా జగనన్న ఆరోగ్య సురక్ష

నరసరావుపేట రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మూరబోయిన సుబ్బాయమ్మ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుబ్బాయమ్మ అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ సుబ్బాయమ్మ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 2వ తేదీ నుంచి ప్రతి గ్రామంలో వైద్యశిబిరాలను నిర్వహిస్తారని తెలిపారు. ఆరోగ్య సమస్యలతో గతంలో చికిత్స పొందిన వారు వైద్య శిబిరాలకు హాజరై వైద్యసేవలు పొందాలని సూచించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పలు శాఖల అధికారులు వివరించారు. మిచౌంగ్ తుఫాన్ కారణంగా మండలంలో శనగ పంట దెబ్బ తినడంతో 80 శాతం సబ్సిడీపై 1400 క్వింటాళ్ల విత్తనాలను పంపిణీ చేసినట్టు ఏవో నరేంద్ర బాబు తెలిపారు. ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలతో ప్రతి గ్రామంలో నూతనంగా చెరువును ఏర్పాటు చేసుకోవచ్చని ఏపీవో కట్టా నాగేశ్వరరావు తెలిపారు. దీంతో పాటు నీటి కుంటలు, చెక్ డ్యాంలకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్‌డీ విజయ కుమార్, పీఆర్ డీఈ హరనాథ్, ఎంఈఓ ఏసుబాబు, కార్యాలయ ఏవో శ్రీనివాసరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఎస్టీయూ క్యాలెండరు ఆవిష్కరణ

శావల్యాపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఎస్టీయూ సంఘం నూతన క్యాలెండరు ఆవిష్కరణ శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయలక్ష్మి, ఎస్టీయూ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యు.చంద్రజిత్‌యాదవ్, మండల అధ్యక్షులు రాజారమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫాస్టర్లు ఐకమత్యంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే గోపిరెడ్డి


నరసరావుపేట: జిల్లాలోని ఫాస్టర్లు అందరూ చెట్టులోని ఆకుల మాదిరిగా కలిసిమెలసి ఐకమత్యంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆకాంక్షించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో పల్నాడు జిల్లా ఫాస్టర్ల ఫెలోషిప్‌గా ఏర్పడిన నూతన కార్యవర్గ సభ్యులు కలెక్టర్‌తో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాస్థాయి కమిటీ ఏర్పాటు చేసుకోవటం శుభపరిణామమన్నారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఫెలోషిప్ లోగోను ప్రారంభించి మాట్లాడుతూ పల్నాడు జిల్లాకి ఈ ఫెలోషిప్ వెలుగుగా ఉండాలని, పాస్టర్స్ అందరు క్రీస్తు ప్రేమను జిల్లా ప్రజలపై చూపించాలని కోరారు. ఫెలోషిప్ ద్వారా రూపొందించిన నూతన ఐడెంటిటీ కార్డులను అందజేశారు. పల్నాడు డిస్ట్రిక్ట్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ బిషప్ డా. గంజికుంట జయప్రకాష్, ఉపాధ్యక్షులు కాల్వ యేసుపాదం, గ్రంధి షాలేంరాజు, అమృతపూడి పాపారావు, ప్రధాన కార్యదర్శి జి.ప్రకాష్, కార్యదర్శి చెదలవాడ భాస్కరరావు, కోశాధికారి ఆకుల సువర్ణరాజు, సంయుక్త కార్యదర్శి మాగులూరి యోహోవా, సంయుక్త కోశాధికారి రసమెట్టి ఏసుబాబు, గౌరవ సలహాదారులు ముంద్ర సైమన్, పల్నూరి జోషప్, వర్ల రాంబాబు, పాస్టర్ ఆలేటి జోసఫ్ కుమార్, పందిటి సీమోను పాల్గొన్నారు.




సభ్యులతో కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ


చిలకలూరిపేట: పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఇతర రంగాల సేవల కన్నా ఎంతో విలువైనవని రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షుడు కావు వెంకటరావు చెప్పారు. రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, క్లబ్ కార్యదర్శి ఆళ్ల వేమన రెడ్డి, సభ్యులు తోటకూర వెంకట నారాయణ, గల్లా సాంబశివరావు, తియ్యగూర యశ్వంత్‌రెడ్డి, గోగినేని నాగేశ్వరరావు పాల్గొన్నారు.




● ఆటాడుకుందాం ..



బొల్లాపల్లిలో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు



నరసరావుపేటలో బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు



చిలకలూరిపేటలో బ్యాడ్మింటన్‌లో తలబడుతున్న క్రీడాకారులు